క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలపై విచారణ


అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు

శ్రీరంగరాజపురం: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం గురించి సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు స్పందించారు. మంగళవారం ఆయన 49 కొత్తపల్లిమిట్టలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి గురించి విచారణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని, అందులో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆక్రమణకు గురైన ఆర్‌అండ్‌బీ భూమిని పరిశీలించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లైకు సూచించారు.

సురక్షిత ప్రాంతాల్లో ఉండండి


కోట చెరువును పరిశీలస్తున్న పోలీసులు

కార్వేటినగరం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రభుత్వం చిత్తూరు జిల్లాను రెడ్ అలెర్టుగా ప్రకటించిందని సీఐ హనుమంతప్ప తెలిపారు. మంగళవారం స్థానిక కోటచెరువును సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో పాడుబడిన ఇళ్లలో నివాసం ఉండేవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉండేవారు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తలదాచుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్పా బయటకు రాకూడదని, అవసరమైతే 9440900689, 9440900690 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వర్షం వచ్చినా వేచి ఉండాల్సిందే..


సిలిండర్లు క్యూలో పెట్టి వేచిచూస్తున్న వినియోగదారులు

నగరి: గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవడానికి వచ్చిన కొత్త పద్ధతులు వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఓటీపీ సిస్టం పుణ్యమా అంటూ గ్యాస్ డోర్ డెలివరీ కొండెక్కింది. గతంలోలా సిలిండర్‌లు క్యూలో పెట్టి సిలిండర్ వాహనం కోసం వేచిచూడాల్సిన రోజులు వచ్చాయి. వాహనం వద్దకే పుస్తకాలు తీసుకెళితే వారే బుక్ చేసి ఓటీపీ ఎలా వస్తుందో వారే చూసుకుంటారులే అంటూ వినియోగదారులు క్యూ కడుతున్నారు. మంగళవారం మున్సిపల్ పరిధి కొండచుట్టు మండపం వద్ద వర్షాన్ని సైతం లెక్కచేయక సిలిండర్లు క్యూలో పెట్టి వినియోగదారులు వేచిచూశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

శ్రీరంగరాజపురం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ గిరి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో మండలవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవడంతో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు చేరి రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. వేడి చేసిన గోరు వెచ్చని నీటిని తాగాలన్నారు. ఈ సీజన్‌లో జ్వరం, మలేరియా, డెంగీ, కలరా వ్యాధులు వచ్చే అవకాశాలు ఉందని, అనారోగ్యం అనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర జూడో పోటీలకు వడమాలపేట విద్యార్థులు


క్రీడాకారులతో పీడీ చంద్రశేఖర్‌రాజు

పుత్తూరు: రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు వడమాలపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం తిరుపతిలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో 17 ఏళ్ల లోపు బాల బాలికలకు జిల్లా స్థాయి జూడో పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న వడమాలపేట క్రీడాకారులు భాను ప్రకాష్ 50 కిలోల విభాగంలో, మానస 62 కిలోలు, యశ్వంతి 90 కిలోల విభాగంలో ప్రథమ స్థానాల్లో నిలిచి రాష్ట్ర జూడో పోటీలకు అర్హత సాధించారు. వీరు ఈ నెల 20, 21 తేదీలలో శ్రీకాళహస్తిలో జరిగే రాష్ట్ర స్థాయి జూడో పోటీలలో చిత్తూరు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులను వడమాలపేట పాఠశాల హెచ్‌ఎం కరుణా నవనీతం, పీడీ చంద్రశేఖర్‌రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

అన్నదాత సుఖీభవకు మంగళం

రైతన్నను సాగు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఎండలతో ఉక్కిరిబిక్కిరై వేరుశనగ పంట ఎండిపోయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం మొహం చాటేసింది. ఖరీఫ్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమైనా రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయంగా ×అన్నదాత సుఖీభవ₹ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు అందిస్తామంటూ ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు హామీలను అమలు గుప్పించిన విషయం తెలిసిందే. అయితే గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని రైతులు, సామాన్యులు విమర్శలు గుప్పిస్తున్నారు.

- అన్నదాత సుఖీభవ లేదు... పంట భీమా అసలు ఊసే లేదు...?
- ఖరీఫ్ ముగిసినా అందని పెట్టుబడి సాయం
- రబీ సాగుకు ఇబ్బంది పడుతున్న రైతులు
- జగనన్న పాలనలో ఠంఛన్‌గా రైతుభరోసా
- నేడు ఆ ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం


వేరుశనగ సాగుపై అవగాహన కార్యక్రమం

శ్రీరంగరాజపురం: వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన రైతుభరోసా పథకాన్ని కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ అని పేరు మార్చిందే తప్ప అమలు చేయలేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో రబీ కింద అధిక శాతం మంది రైతులు శనగను సాగు చేస్తారు. వైఎస్‌ఆర్ సీపీ పాలనలో శనగలకు 40 శాతం సబ్సిడీ ఇస్తే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మార్కెట్ రేటును అధికంగా చూపి కేవలం 25 శాతం మాత్రమే శనగ విత్తనాలపై సబ్సిడీ ఇచ్చింది. దీంతో ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ రేటు, బయట మార్కెట్ రేటుకు పెద్దగా తేడా లేదు. ప్రభుత్వం అందజేసిన సబ్సిడీ విత్తనాల మూలంగా ఒరిగిందేమీ లేకపోయింది.

అంతంతమాత్రంగా దిగుబడి

కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందజేయక పోయినా చిన్నసన్నకారు రైతులు ఖరీఫ్ సాగుకు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఖర్చు చేశారు. వర్షాభావ పరిస్థితులు, అధిక వర్షాలతో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల దిగుబడి అంతంతమాత్రంగానే వచ్చింది. రైతులకు పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి నెలకొంది. రబీ సీజన్ కూడా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకుంటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయం అందజేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సమయానికి పెట్టుబడి సాయం

వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. ప్రతి ఏటా సీజన్‌కు ముందుగానే రైతుభరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందజేసింది. ప్రతి ఏడాది ప్రతి ఒక్క రైతుకు రూ.13,500 చెల్లించేది. ఖరీఫ్ పంట వేసే ముందు మే నెలలో రూ.7,500 , ఖరీఫ్ కోత, రబీ అవసరాల కోసం అక్టోబర్‌లో రూ.4 వేలు, జనవరిలో పంటకోతల సమయంలోనూ రూ.2 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తూ రైతులకు అండగా నిలిచింది. అయితే కూటమి ప్రభుత్వం రైతుభరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవగా మార్చింది. ప్రతి ఏటా 20 వేలు చొప్పున రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామన్న సీఎం చంద్రబాబు ఆ విషయాన్ని మరిచారు. దీంతో రైతులకు సాగు పెట్టుబడికి ఇబ్బందులు తప్పడం లేదు.

పెట్టుబడికి ఇబ్బందులు



గత ప్రభుత్వ పాలనలో ప్రతి ఏడాది రైతు భరోసా డబ్బులు వచ్చేవి. పంటల సాగుకు ఎంతగానో ఉపయోగపడేవి. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎలాంటి డబ్బులు వేయడం లేదు. పంటల సాగుకు పెట్టుబడుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం అందజేయాలి.

– పి.గజేంద్ర, రైతు, పెద్ద తయ్యూరు

పెట్టుబడి సాయం అందించాలి



గత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి సాయాన్ని అందించేది. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. ఖరీఫ్ సీజన్ ముగిసినా పెట్టుబడి సాయం అందలేదు. పంట సాగుకు వడ్డీ వ్యాపారస్తులే దిక్కవుతున్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తామన్న రూ.20 వేలు అందజేస్తే రబీ సాగుకు ఎంతగానో మేలవుతుంది.

– ఎం.వెంకటేష్, తయ్యూరు

అక్రమ కట్టడాలకు పన్నులు వద్దు


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులు

నగరి: మున్సిపల్ పరిధిలోని అక్రమ కట్టడాలకు మున్సిపల్ పన్ను విధించరాదని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి పాలకవర్గసభ్యులు వినతిపత్రం అందించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లిన వారు మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన కట్టడాలకు పన్ను విధించవద్దని కోరారు. అలా పన్ను విధిస్తే సదరు కట్టడాలు సక్రమమని మున్సిపల్ శాఖ ద్వారా రుజువు చేసినట్లవుతుందని తెలిపారు. ఇది కౌన్సిల్ ముమ్మాటికీ ఒప్పుకోదదన్నారు. ఇలాంటి కట్టడాలకు మున్సిపల్ పన్ను వేసినట్లు తెలిస్తే పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నాలు చేస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, మునికృష్ణారెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఎల్లప్ప రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పాలసముద్రం : మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి బదిలీపై వచ్చిన జూనియర్ అసిస్టెంట్ భరత్‌చంద్ర, టైపిస్టు గణేష్, అటెండర్ దివాకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కేవీబీ పురం మండలంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ భరత్‌చంద్ర, అటెండర్ దివాకర్, జిల్లా పరిషత్‌లో పని చేసే గణేష్ బదిలీపై పాలసముద్రం మండలానికి వచ్చారు.

అభ్యసన వైకల్యంపై అవగాహన

పుత్తూరు: పట్టణంలోని భవిత కేంద్రంలో మంగళవారం డిస్లెక్సియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ తిరుమలరాజు మాట్లాడుతూ నిర్దిష్ట అభ్యసన వైకల్యాల పిల్లల్లో పురోగతి తీసుకురావాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఇందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 బాలసుబ్రమణ్యం, మెయిన్ స్కూల్ హెచ్‌ఎం మురళీకృష్ణ, రీసోర్స్ టీచర్స్ ఆనంద్, సూర్యకుమారి, జగదీశ్వరి పాల్గొన్నారు.


పుత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓలు

వడమాలపేటలో: భవిత సెంటర్ విద్యార్థులకు సంబంధించి నిర్దిష్ట అభ్యసన వైకల్యాలపై అవగాహన ర్యాలీని మంగళవారం వడమాలపేటలో నిర్వహించారు. ఎంఈఓ పద్మావతి మాట్లాడుతూ చదువులో వెనకబడిన విద్యార్థుల్లో ఐదు రకాలకు సంబంధించిన లోపాలు ఉంటాయని తెలిపారు. ఈ లోపాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చునని తెలిపారు. ఎంఈఓ–2 తులసీరామ్ శిక్షణ వివరాలను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కరుణ నవనీతం, భవిత సెంటర్ ఉపాధ్యాయులు హేమలత, విజయకుమారి, కుమారి, సీఆర్‌పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



వడమాలపేటలో ర్యాలీ

వైభవంగా అయ్యప్ప పడిపూజ

- నేత్రపర్వంగా అలంకరణ
- భారీగా అన్నదానం



పుష్పాలంకరణలో అయ్యప్పస్వామి, భజన చేస్తున్న అయ్యప్ప భక్తులు

నగరి: బైపాస్ కూడలి సమీపంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం పడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు పుష్పాలతో ఆలయాన్ని, అయ్యప్ప స్వామిని నేత్రపర్వంగా అలంకరించారు. అయ్యప్ప పాటల భజనలు, అర్చన మంత్రాలను అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు ఉచ్ఛరిస్తూ భజనలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. పుష్పార్చన పూజకు వాడిన పుష్పాలను, తులసిని మహిళలు భక్తిశ్రద్ధలతో ఇళ్లకు తీసుకెళ్లారు. పూజలో భాగంగా మధ్యాహ్నం వెయ్యిమంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి కన్నప్ప, భక్తులు మునస్వామి, రమేష్ బాబు, సురేష్, దుర్గాప్రకాష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం

- లోతట్టు ప్రాంతాలవారిని అప్రమత్తం చేసిన అధికారులు
- నగరిలో 21.4 మి.మీ వర్షపాతం


నగరి: వర్షానికి రోడ్డుపై తగ్గిన జనసంచారం

నగరి: తుపాను ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా మంగళవారమంతా కురిసింది. వాతావరణంలో చల్లదనం చోటుచేసుకుంది. రెయిన్‌కోట్, గొడుగు లేనిదే బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సాయంత్రం వరకు నగరిలో 21.4, విజయపురంలో 20.4, నింద్రలో 17.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మట్టిరోడ్లన్నీ చిత్తడిగా మారాయి. తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, డీఈ రవీంద్రారెడ్డి, వీఆర్‌ఓలు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది లింగీసుగుంట, నగరిపేట బీసీ కాలనీ, కశింమిట్ట యానాది కాలనీలలో పర్యటించారు. తుపాన్ ప్రభావం ఉండడంతో ముందస్తు జాగ్రత్తగా అక్కడ నివశించే ప్రజలకు సూచనలు ఇచ్చారు.

కార్వేటినగరం: మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జీడీనెల్లూరు నియోజకవర్గ వ్యాప్తంగా జనం ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా పంటపొలాల్లోకి నీరు చేరడంతో పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. పలుచోట్ల రోడ్లపై నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

శ్రీరంగరాజపురం : మండలవ్యాప్తంగా పంటలు నీట మునిగాయి. పొలాలు, రోడ్లు చెరువులను తలపించాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవన స్రవంతి బాగా ఇబ్బంది పడుతున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉంది. ప్రజలను అప్రమత్తం చేయడానికి అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే అన్ని మండల కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండండి..

కార్వేటినగరం : ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్వేటినగరం ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. మంగళవారం మేజర్ పంచాయతీ కార్వేటినగరం పరిధిలోని చాకలివానిగుంట, పద్మసరస్సు ఎస్టీ కాలనీలలో పర్యటించి పూరిగుడిసెలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడిసెల్లో ఉన్న వారి కోసం ప్రభుత్వ పాఠశాలలో పునరావాసం ఏర్పాటు చేశామని, అక్కడ తలదాచుకోవాలని ఆదేశించారు. అనంతరం పద్మసరస్సు చెరువు, కోటచెరువులలో నీటిమట్టాన్ని పరిశీలించారు. ఈఓ నాగరత్నమ్మ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కేశవులు, మహిళా పోలీసు, ఇతర సిబ్బంది ఉన్నారు.

రాకపోకలకు తీవ్ర అంతరాయం

పాలసముద్రం : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్లపై నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వెంగళరాజుకుప్పం సమీపంలో జాతీయ రహదారిపై నీరు భారీగా ప్రవహిస్తుండడంతో బస్సులు, ఇతర వాహనాలు దాటలేక ఒకవైపు ఆగిపోయాయి. రైతులు సాగు చేసిన వరి పంటలో నీరు చేరడంతో నేలవాలింది. ఎంపీడీఓ విద్యావతి సిబ్బందితో కలసి ఎస్టీ కాలనీల్లో పర్యటించారు. పూరి గుడిసెల్లో ఉండేవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విజయపురం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సోమవారం తహసీల్దార్ కిరణ్ తెలిపారు. రెండు రోజులు తుపాన్ ప్రభావం ఉండడంతో వాగులు, వంకలు పొంగి రహదారిపై ప్రవహించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ప్రజలు బయట రాకుండా ఇళ్లకే పరిమితం కావాలని సూచించారు. ఇప్పటికే తమ సిబ్బంది ప్రతి పంచాయతీలో అందుబాటులో ఉన్నారని, ముంపు ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే 9491077037 నెంబర్‌కు కాల్ చేయాలని ఆయన తెలిపారు.


కార్వేటినగరం: చాకలివానిగుంట ఎస్టీ కాలనీలో పూరి గుడిసెలను పరిశీలిస్తున్న అధికారులు


కార్వేటినగరం: పద్మసరస్సు చెరువును పరిశీలిస్తున్న అధికారులు


శ్రీరంగరాజపురం : కమ్ముకున్న మేఘాలు




హంసాపురం, నరసింహపురంలో నేలకొరిగిన వరి, మహదేవపురంలో టెంకాయతోటల్లో వర్షపు నీరు, రోడ్డుపైకి వర్షపునీరు రావడంతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులకు

తూతూమంత్రంగా వార్డు సభ్యుల శిక్షణ

- ఆరు నిమిషాల్లో ముగింపు
- 75 మందికి 9 మంది హాజరు
- గైర్హాజరైన ఎంపీపీ, సభ్యులు, అధికారులు
- ఖాళీగా దర్శన మిచ్చిన కుర్చీలు
- సమాచారం ఇవ్వడంలో అధికారులు విఫలం


విజయపురం : శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న 9 మంది సభ్యులు

విజయపురం: ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజులపాటు ఉపసర్పంచ్, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం ఆరు నిమిషాల్లోనే ముగిసింది. ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు నిర్వహించాల్సిన శిక్షణ కార్యక్రమం 12.15గంటలకు 9 మంది వార్డు సభ్యులతో ప్రారంభించారు. వెంటనే 12.20కి ముగించేశారు. ఈ ఆరు నిమిషాల్లో రెండు నిమిషాలు టీ తాగడానికి సరిపోయింది. సాయంత్రం వరకు జరగాల్సిన శిక్షణ కార్యక్రమాన్ని కేవలం ఆరు నిమిషాల్లోనే ముగించారంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో వీటిని బట్టి తెలుస్తుందంటున్నారు.

గైర్హాజరైన ఎంపీపీ, వార్డు సభ్యులు

ఉపసర్పంచ్, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమానికి గౌరవ అధ్యక్షురాలిగా వ్యవహరించవల్సిన ఎంపీపీ గైర్హాజరు అయ్యారు. అలాగే 25 పంచాయతీలలో పంచాయతీకి ఒక ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులు హాజరు కావల్సి ఉంది. మొత్తం 75 మందికి గాను 9 మంది హాజకావడంతో కుర్చీలన్ని ఖాళీగా దర్శనమిచ్చాయి. ఆశించిన స్థాయిలో సభ్యులు హాజరు కాకపోవడంతో శిక్షణ కార్యక్రమం తూతూ మంత్రంగా ముగిసింది.

సమాచారం ఇవ్వకపోవడంతోనే...

ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు రెండు రోజులు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని అధికారులు ఎవ్వరూ చెప్పకపోవడంతోనే ఈ కార్యక్రమం విఫలమైందని విమర్శలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉండాల్సిన ఎంపీపీకి కూడా సమాచారం అందించకపోవడం చూస్తుంటే అధికారులు పని తీరు ఎలా ఉందో అర్థమవుతోంది. జిల్లా అధికారులు ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ఆదేశించిన కార్యక్రమాన్ని అధికారులు నీరుగార్చేశారని పలువురు విమర్శిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు విజయపురం మండలం వైపు దృష్టి సారించాలని కోరుతున్నారు.

వరద బాధితులకు ఆర్థికసాయం అందజేత

చిత్తూరు కలెక్టరేట్ : విజయవాడ వరద బాధితులకు జిల్లా ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు సహాయం చేశారు. ఈ మేరకు సంఘ నాయకులు మంగళవారం చెక్కును కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అరుణ్ కుమార్ మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులకు తమ సంఘం తరపున రూ. 86,100 చెక్కును అందజేసినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పేదలను తమ వంతు ఆదుకునేందుకు సేవా భావంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో డీవైఈఓ చంద్రశేఖర్, సంఘం ప్రధాన కార్యదర్శి రవీంద్రారెడ్డి, కోశాధికారి హేమాద్రి పాల్గొన్నారు.

రిటైర్డు పోలీసు వితరణ..

చిత్తూరు అర్బన్: విజయవాడ వరదలతో నిరాశ్రయులుగా ఉన్నవారిని ఆదుకోవడానికి జిల్లా రిటైర్డు పోలీసు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. మంగళవారం చిత్తూరు నగరంలో ఎస్పీ మణికంఠను రూ.35 వేల చెక్కును అందచేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మురళి, ఫ్రెడ్రిక్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు


ఎస్పీకి చెక్కు ఇస్తున్న రిటైర్డు పోలీసులు